# జ్ఞానం ఉదయించింది

(ఆంధ్రప్రభ 11-7-90)

---

కులాంతర వివాహాలు ఒకనాటి సాంప్రదాయంకాదు.

మారిన కాలంతోపాటు మనం మారకపోతే అది ఈనాటి మూఢ నమ్మకం అవుతుంది.

—జయప్రద

---

"సింధూ! దీప్తి రిసెప్షన్ రేపు. నువ్వు, అన్నయ్యగారూ తప్పకుండా రావాలి. నువ్వు కాస్త ముందే వచ్చావంటే నాకు హెల్ప్ చేసినదానివవుతావు."

నేను మొదట తుళ్ళిపడ్డాను. తరువాత గతుక్కుమంది నా మనసు-'దీప్తి రిసెప్షనా?'

"ఏమిటే సింధూ! అలా చూస్తావు. దీప్తి రిసెప్షన్ రేపు."

"ఆ....ఆ...." పెదాలమీద నవ్వు పులుముకున్నాను. "తప్పకుండా వస్తాను దీప్తి రిసెప్షన్‌కి. మేము రాకపోవడమేమిటి?"

"అయితే వస్తాను. అఁ-ఎక్కడని అడగవేం?

తత్తరపడ్డాను నేను తరువాత సర్దుకుంటూ. "నువ్వే చెప్తావు కదా!" అని నవ్వేశాను.

"హడావుడిలో నాకూ మతిమరుపొచ్చేసింది" రాజీ కళ్ళు మెరుస్తున్నాయి. ఆమె ఆనందం కళ్ళలో రిఫ్లెక్ట్ అవుతోంది.

"హోటల్ శివంలో. ఇంట్లో అంటే చాలాపని. అసలే ఆలోచించి. ఆలోచించి అలసిపోయున్నానా? అందుకని హోటల్‌కి ఆర్డర్ ఇచ్చేశా!"

రాజీ చెపుతోంది. నేను వింటున్నాను. నా ఆనందాన్ని ప్రకటించటానికి వెనకాడుతున్నాను.

"ఏదో చిన్నపిల్ల తొందరపడింది. తల్లి దండ్రులం మనం క్షమించకపోతే ఎవరు క్షమిస్తారు?" అలా అనేసి పాలిపోయిన నా ముఖంవంక చూసి "సారీ సిందూ!" అంది.

పశ్చాత్తాప పడాల్సింది రాజీ కాదు తను. ఇప్పుడు కాదు. ఐదు సంవత్సరాల క్రితం.

"వస్తానూ, నువ్వు త్వరగా వచ్చెయ్. నాకు కాళ్ళూ, చేతులూ ఆడటంలేదు. రేపే మరలా దీప్తిని అత్తగారింటికి పంపడం. సారె అదీ...." నా కళ్ళలో ఏ భావం స్ఫురించిందో మధ్యలో ఆపేసి గడప దాటి కారెక్కేసింది రాజీ.

నేను నిల్చున్న చోటనించి కదల్లేదు. కదలడానికి నా కాళ్ళలో శక్తి లేదు.

ప్రేమ, పశ్చాత్తాపం, రెండూ కలిసి నన్ని రోజు మరోసారి శక్తిహీనురాల్ని చేసేశాయి.

"అమ్మా! నేను దినేష్ చంద్రని ప్రేమించాను. మన కులం కాదు, మన మతం కాదు. మీరు అంగీకరించరని భయపడి యిక్కడికి కొచ్చేశాము. మిమ్మల్ని చూడాలని వుంది. నువ్వు, నాన్నగారు రమ్మంటే వస్తాం."

బిడ్డ కనపించడం లేదన్న దిగులు, కంగారులను ఆ ఉత్తరం చింపలేదు.

ఆవేశాన్ని మాత్రం పెంచింది. ఆ ఉత్తరం చదివి ఆయన ఇంతెత్తున లేచారు.

"మనం వద్దనుకుని వెళ్ళిపోయిందది. ఇక తనతో మన కెలాటి సంబంధం లేదు. నా కొక్క కూతురే అనుకుంటాను" అని ఆయన అరిస్తే–

తను ఈ పిల్ల అలా ఎందుకు చేసింది. తామే ఓ మంచి అబ్బాయిని చూసి పెళ్ళి చేయలేకపోయామా! ఎంత తొందరపడిందీ. 'కులం కాని కులం, ఊరు కాని ఊరు' అని దిగులుపడిందే తప్ప భర్తను సర్ధడానికి ప్రయత్నించిందా?

ఇరవై రెండేళ్ళు కళ్ళలో పెట్టుకుని పెంచితే ఇదా బిడ్డలు చేయాల్సిన నిర్వాకం? అని గింజుకుందే కానీ, నిన్ను చూడాలనుంది రమ్మంటావా? అన్న కూతురు ఆరాటాన్ని అర్థం చేసుకోలేదు.

'ఇప్పుడెలా వుందో? ఎక్కడ వుందో ?' నిల్చోను శక్తి లేదు. కూలబడిపోయాను.

హాల్లో ఫోన్ మోగింది. అక్కడి దాకా నడచివెళ్ళే ఓపిక లేదు- ఇంకా మోగుతూనే వుంది. ఆ ఫోన్ శ్రావ్య దగ్గర్నుండయితే ఎంత బావుణ్ణు....

ఆ ఊహకు అంతరాంతరాల్లో నుండి ఎవరో చెళ్ళున కొరడాతో కొట్టినట్టయింది.

తను కోరినట్లు శ్రావ్య ఆతని పెళ్ళి చేసుకున్న కొత్తల్లో ఫోన్ చేసింది.

"మమ్మీ! నాకు దిగులుగా వుంది. ఒక్కసారి రా మమ్మీ! లేదా నన్ను రమ్మంటే వస్తాను. నా ఉత్తరానికి జవాబివ్వలేదు నువ్వు"

తను మాట్లాడలేదు. బిగుసుకుపోయింది. నిజం చెప్పాలంటే మాట్లాడాలనే వుండింది. 'ఎలా ఉంది మీ కాపురం?' అని అడగాలనే వుండింది.

కానీ అడగలేదు. అహం అడ్డు వచ్చింది.

మొదటి బిడ్డ ముందుగా మాతృమూర్తిని చేసిందనే ఆనందంలో ఆ పిల్లని ఎంత అపురూపంగా పెంచుకుంది!

అలాటి పిల్ల ఎలా మోసం చేసింది అనే బాధ తనని మాట్లాడనీయ లేదు.

ఇప్పుడనిపిస్తోంది- ఇష్టపడిన చీర కొనుక్కుంటున్నాం, ఇష్టపడిన వస్తువు తింటున్నాం. అంతే! ఇష్టపడిన వ్యక్తిని శ్రావ్య చేసుకుంది. దీంట్లో తప్పేముంది?

కాకపోతే తాము కాదంటామని రహస్యంగా పెళ్ళి చేసుకుంది. అంతే. కానీ అలా అని ఇప్పుడనిపిస్తే ఏం లాభం ? ఫోన్ శబ్దం ఆగి పోయింది.

"ఎలా ఉందో? ఏమో?"

కళ్ళలో నీళ్ళు రావడంలేదు కానీ, గుండెలో బరువు, మనసులో దిగులు ఊపిరాడనీయకుండా, స్థిమితపడనీయకుండా!

తల్లి దండ్రులు పెళ్ళి చేయగానే అందరూ సుఖపడిపోతున్నారా? ఎవరి అదృష్టం వాళ్ళది.

పెళ్ళి ఓ గీత. ఆ గీత దాటాక ఎలాటి జీవితం ఎదురైనా స్వీకరించాల్సిందే! తప్పేదేముంది?

కానీ తన చిన్నారి తల్లి గుండె ఏనాడయినా దేనికయినా కన్నీరు కారిస్తే ఆ కన్నీరు తుడవడానికి ఒక్క హస్తంకూడా లేదక్కడ. ఒక్క చేయి కూడా ఓదర్చడానికి మిగలకుండా తన బిడ్డకు తమ వాళ్ళందర్నీ దూరం చేసింది. తమ అహంకారం- తామే వద్దనుకున్న ఆ బిడ్డ ఎవరికి కావాలి?

ఒక్క ఉత్తరం ముక్క- ఒక్క ఉత్తరం ముక్క రాయ కూడదూ? ఒకవేళ పెద్దవాళ్ళం ఏదో ఆవేశపడ్డాము. అర్థం చేసుకో నక్కరలేదూ? నా గుండెలో భావం కరిగి కన్నీటి రూపంలో బయట పడింది.

ఊహుఁ, రాయదు. ఎందుకు రాస్తుంది. ఉడుకు రక్తం కదా ! నా కోపం, నా ప్రేమ నాచేత అలా ఆలోచింప ప్రయత్నించినా నా మన స్సందుకు అంగీకరించలేదు. పాపం ఎన్ని ఉత్తరాలు రాయలేదా రోజుల్లో శ్రావ్య.

ఒక్కదానికయినా జవాబిచ్చిందా తను. పైగా నాకు దివ్య ఒకటే బిడ్డ అని రాసింది.

దివ్య ఒకటే చాలనుకున్న తమకు దివ్య తమ బిడ్డగానే, తాము చెప్పిన వ్యక్తినే పెళ్ళి చేసుకొని తాము కోరినట్టే భర్తతో హాయిగా సంసారం చేసుకుంటోంది.

తనని చూడను వచ్చిపోతూనే వుంది. అయినా ఈ అశాంతి ఏమిటి? జీవితంలో భర్తీకాని ఈ లోటేమిటి?

రింగ్.... రింగ్‌మని మరలా ఫోన్ మోగుతోంది. ఎవరో? నీర సంగా లేచాను.

నలభయ్ మూడేళ్ళ దానిలా గోడ ఊతతో ఫోన్ దగ్గరకు వెళ్ళాను.

ఎందుకీ నీరసం? హాయిగా తింటున్నాను. మామూలుగా తినడం కాదు, మామూలు కంటే ఎక్కువగా భార్య బలహీనమైందని.... పళ్ళు, గుడ్లు, హార్లిక్స్‌లు, గ్లూకోజులు ఇవన్నీ ఏమైపోతున్నాయి. వాటి సారం రక్తాన్ని చేరకముందే దిగులు వాటిని మింగేస్తోందా ?

పాపం ఎన్ని ఉత్తరాలు రాసింది. ఎంతగా ప్రాధేయపడింది, ఆఖరకు అల్లుడి చేత కూడా రాయించింది. ఒక్క జాబుకి కూడా తాము కరగలేదు. ఒక్కదానికంటే ఒక్కదానికి హృదయం ద్రవించివుండినా-రామ్మా శ్రావ్యా అని ఒక్క ముక్క రాసినా ఈ రోజు ఈ జీవితం ఇంత ఎండిపోయేది కాదు. రసహీనంగా వుండేది కాదు. ఆ క్షణంలో శ్రావ్య మీద ఎంత కోపం వచ్చిందో! ఎంత విరక్తి కలిగిందో! ఆదంతా శాశ్వత మనుకుని నువ్వు మాకు అక్కరలేదు. దివ్య ఒకటే చాలు అనుకున్నారు. అది రక్తపాశమని, ఆ ఆవేశాలు, కోపాలు, విరక్తులు చాలా కాలం నిలవవనీ అనుకోలేదు తాము. తమకు ఎవ్వరూ ఆ మాట చెప్ప లేదు కూడా.

ఫోన్ మోగుతూనే వుంది. ఫోన్ ఎత్తాను. చేతులు వణుకుతున్నాయి.

రెండు గంటల క్రితం వరకు మరీ ఇంత నీరసంలేదు. తను అసూయపడుతోందా? తన స్నేహితురాలి బిడ్డ జీవితంలో రేపు కురవబోతున్న ఆనందపు జల్లుని తలచుకుని బాధపడుతోందా?

"హలో.... హలో...."

"ఓహ్! తను ఫోన్ ఎత్తింది కదూ?" తనవైపునుండి ఏ శబ్దమూ లేకపోవడంతో అటునుండి అరుస్తున్నారు ఫోన్ బాగలేదేమోనని. ఆ గొంతు రాజీది.

"రాజీ!"

"ఆఁ, ఏమిటీ మాట్లాడవు? ఒంట్లో బాగాలేదా?"

"ఆఁ. నీరసంగా వుంది"

"సరేలే, నీతో కాసేపు మనసు విప్పి మాట్లాడుకుందామనుకున్నాను. అసలు నిన్ను పిలవడానికే కాదు నేనొచ్చింది. ఓ గంట నీతో గడుపుదామని వచ్చాను నువ్వు ఏదోలా వున్నావు. సరేలే రేపొస్తారుగా మాట్లాడుకుందాం"

"సారీ రాజీ!" నేను తేరుకుంటూ అన్నాను. నేను పరధ్యానంలో పడడం రాజీ గమనించిందన్నమాట.

"ఫర్వాలేదు చెప్పు. ఏమిటో–మనసు బాగలేక అనుకున్నాను. ఆ రోజు నేనూ నీతోపాటు ఆవేశపడి పొరపాటు చేశాను సింధూ"

'నువ్వేం చేశావులే' అని అన్నాను కానీ, నాకిప్పుడు నా శ్రేయోభిలాషులనుకున్న వీళ్ళందరిమీదా కోపమే. ఒక్కరంటే ఒక్కరు నువ్వు చేస్తున్న పని తప్పు సింధూ అని చెప్పారా ఆ రోజు? ఆ రోజు దినేష్ చంద్ర శ్రావ్యను తీసుకుని వాకిట్లోకి వస్తే కనీసం లోపలికి రమ్మని తను పిలవలేదు సరే. అప్పుడు అక్కడే వున్న రాజీ అయినా కనీసం పిలిచి ఉండవచ్చు కదా!

"సారీ సింధూ! నీకు శ్రావ్యను గుర్తు చేశానేమో! సారీ అయిదేళ్ళ క్రితం ఇంతజ్ఞానం లేకపోయింది నాలో. పెట్టేస్తాను రెస్ట్ తీసుకో. ఈ హడావుడంతా అయిపోయాక ఒక రోజంతా నీతో వుంటాను. దిగులు పడకు సింధూ!"

నేనేం మాట్లాడలేదు. మాట్లాడే శక్తి నాలోలేదు. నిజానికి రాజీ ఏం చేయగలదు? నేనానాడు వాళ్ళని లోపలికి ఆహ్వానించుంటే తను అతిథి మర్యాదలు చేసుండేది–పరాయి ఇంట్లో తనేం స్వతంత్రిస్తుంది!

ఇప్పుడు అనుకుని ఏం లాభం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు.

"సింధూ! ఫోన్ పెట్టేస్తాను. రేపు తప్పక రావాలి. దీప్తి కూడా నీకు మరీ మరీ చెప్పమంది"

"తప్పకుండా వస్తాను" నా మాటల్లో నేను వ్యక్తం చేయాలని ప్రయత్నించిన సంతోషం వ్యక్తం అయిందో లేదో? రాజీ ఫోన్ పెట్టేసింది.

ఫోన్ దగ్గరున్న సోఫామీద కూర్చున్నాను. తల వెనక్కు వాల్చి కళ్ళు మూసుకున్నాను. కనురెప్పలు మూసినంత మాత్రాన మనసు ఆలోచించడం మానేస్తుందా?

ఈ రోజు శ్రావ్య దినేష్ తన వాకిట్లోకొస్తే ఎంత బాగుణ్ను? ఎంత ఆశ?

'అసలు వాళ్ళెక్కడున్నారో? అడ్రసుంటే ఎంత బాగుణ్ను! తన చేతిలో వాళ్ళ అడ్రస్ వున్నంతకాలం అజాగ్రత్తచేసి, వాళ్ళెక్కడున్నారో తెలిని రోజుల్లో వాళ్ళు కావాలని ఆరాటపడడంలో అర్ధంలేదు?' నిట్టూర్చాను.

ఒక్కోసారి నిట్టూర్పు మనిషికి చాలా రిలీఫ్ నిస్తుంది. కానీ, నాకా రిలీఫ్‌లేదు. ఇంకా గుండె నిండుకున్న భావం. నాలో వ్యక్తం చేయలేని భావదౌర్బల్యం.

కేవలం నలభై ఏళ్ళకు జీవితం అయిపోయినట్టనిపించడం స్వయంకృతాపరాధం. కన్నప్రేమ ఇంత బలమైనదయినప్పుడు సర్దుబాటు తప్పదు.

కోపం, బాధ, పశ్చాత్తాపం విరక్తి ప్రేమ-అన్నీ కలిపి నన్ను ముసలిదాన్ని చేసేశాయి. రాజీ తను ఒకే వయసువాళ్ళు కానీ, రాజీ

నాకంటే పదేళ్ళు చిన్నదనిపిస్తోంది. ఛెంగు ఛెంగున గెంతుతోంది అసూయ పడుతోందా తను?

కాదు అలా తను గెంతాలని ఆరాటపడుతోంది. అలా తనూ గెంతిన రోజులు తల్చుకుని దిగులుపడుతోంది.

ఇలా నిర్వీర్యంగా తను మారడానికి కారణం ఆలోచనా రాహిత్యము. ఆ సత్యం తనను క్రుంగదీస్తోందీ రోజు.

ఆ మానసిక దౌర్బల్యంతో తన స్నేహితురాలి ఆరోగ్యానికి, ఆనందానికి ఈర్ష్య పడుతోంది. నిజానికి తనలా రాజీ మారాలని తనలో ఏమూలా లేదు. అలా జరిగితే తను సంతోషించదు.

మరలా ఫోన్ మోగింది.

"సింధూ! నేను రాజీని. నీ దగ్గరకొచ్చింది మొదలుకుని నా మనస్సేం బాగోలేదు. నీతో మాట్లాడాలి. సమయానికి కారు లేదు. ప్లీజ్ నువ్వు రావా"

నాకూ కొంత మార్పు కావాలనిపిస్తోంది. మనసెరిగిన మనిషి ముందు అహాన్ని వదిలి పెద్దపెట్టున ఏడ్వాలనుంది.

"వస్తున్నాను" ఫోన్ పెట్టేశాను.

కారెక్కాను. ఐహిక సుఖాలకు కొదవేం లేదు. పాపం శ్రావ్య- ఈ సంపదకు హక్కుదారు. ఆర్థికంగా ఎలాటి ఇబ్బందులు పడుతోందో! కారు దిగుతూనే వాకిటవైపు చూశాను. అయిదేళ్ళనాడు తను కట్టాల్సిన మామిడి తోరణాలివి.

ఛీ! ఛీ! ఏమిటీ మనస్సు, ఏమిటీ అసూయ- తను మాత్రం కట్టలేదా? దివ్య పెళ్ళికి కట్టిందిగా. ఇంకా ఎందుకీ అసంతృప్తి. దివ్య అనే మనిషి ఉనికే అంత పట్టించుకునేది కానట్టు ఒకటే శ్రావ్య ఆలోచనలేమిటి? నన్ను నేను తిట్టుకున్నాను.

ఇంట్లోకి అడుగు పెట్టాను. నా కొరకే ఎదురుచూస్తున్నట్టు కారు శబ్దం వినగానే స్టోర్ రూమ్‌లోనుండి కాబోలు హడావుడిగా వస్తోంది రాజీ!

రాజీ నాకు కాఫీ ఇచ్చింది. టెర్రస్‌మీదకు తీసుకెళ్ళింది. ఇద్దరం చెరో కుర్చీలో కూర్చున్నాం.

"సింధూ! నీకో విషయం చెప్పాలి. చెప్పాలా వద్దా అనుకుంటూ నాలుగురోజుల నుండి మధనపడుతున్నాను. ఈరోజు నిన్ను చూశాక చెప్తేనే నీకు మనశ్శాంతి అనిపించింది.

"ఏమిటది?" భయంగా అడిగాను.

"ఏమీలేదు. అశుభమేమీ కాదు. శ్రావ్యవాళ్ళు నాగపూర్‌లో ఉన్నారట"

నా గుండె వేగంగా కొట్టుకుంది. నా శరీరం కంపించింది.

"మళ్లీ కనిపించాడీమధ్య అతను నాగపూర్‌లో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. దినేష్ వాళ్ళ ఇంజనీర్ అట. అతనికి తెలీదు శ్రావ్య ఇక్కడకు రావడంలేదని"

నా కళ్ళు వర్షించాయి. నా గుండె తేలికపడింది. క్షణంలో ఒకే ఒక్క క్షణంలో ఎంత చిత్రం! నేను మాట్లాడలేదు. మాట్లాడడాని కేమీ లేదు. అదే క్షణంలో నిర్ణయం చేసుకున్నాను-వెళ్ళి వాళ్ళను పిలుచుకు రావాలి.

"అన్నయ్యగారితో చెప్పి వెళ్ళండి. వెళ్ళి వాళ్ళను కలుసుకోండి"

సరే అన్నట్టుగా తలూపాను నేను.

"సింధూ! అయిదేళ్ళక్రితం నేను అజ్ఞానంలో ఉన్నానో, లేక కడుపుతీపి తెలిక ఆవేశపడ్డానో! నీకు నేను ఇవ్వాల్సిన టైమ్‌లో మంచి

సలహా ఇవ్వలేకపోయాను. నెవర్ టూ లేట్. ఇప్పుడయినా మించి పోయింది లేదు. నన్ను చెప్పమన్నా అన్నయ్యగారికి నేను చెప్తాను"

"వద్దులే. నేనే చెప్తతాను"

నేను లేచాను వెంటనే వెళ్ళి ఆయనకి సంగతి చెప్పాలనుంది నాకు.

"కాసేపు కూర్చో. నాకేదో దిగులుగా వుంది"

కూర్చున్నాను.

ఈసారి తన గుండెలో బాధ నా ముందు వెళ్ళబోసుకుంది రాజీ. "ఏం ప్రేమలో ఈ వయసులో మంచి,చెడ్డ ఏం తెలుస్తుంది వాళ్ళకి? ప్రేమా ప్రేమా" అని ఒక టీచర్ని ప్రేమించింది. వెనుక ఆస్థిపాస్థులేం లేవు. మనమివ్వదలుచుకున్నదేదో ఇస్తామనుకో. ఏమిటో నాకిష్టంలేదు. కానీ తప్పలేదు సింధూ!"

"ఏమైందసలు?" సహజ కుతూహలంతో అడిగాను.

"మేమిష్టపడమని పెళ్ళిచేసుకుని ఎక్కడికో వెళ్ళిపోయారిద్దరూ. ఈ వారం రోజులుగా నేనుపడ్డ ఈ నరకం నీకు తెలుసుగా, వాళ్ళు పెళ్ళి చేసుకున్న విషయం తెలుసు. అయినా ఆరాటం. అన్న లందరూ నాలుగు దిక్కుల కెళ్ళి పట్టుకొచ్చారు. అమ్మ తిడుతుందని, రానని మొండికేసిందట, బుజ్జగించి తీసుకొచ్చారు.

"పోనీలే నాలా కాకుండా నువ్వు మంచి పనిచేస్తున్నావు"

"ఆలోచించాము సింధూ! ఇదే మంచిదనిపించింది—మనం వెలి వేస్తే సంఘం సంతోషంగా వాళ్ళను వెలి వేస్తుంది. వాళ్ళకు జీవితం లేకుండా పోతుంది. మనమీద సానుభూతి వర్షం కురిపిస్తుంది. అన్నిటి కంటే భరించలేనిది సానుభూతి. అందుకే ఈ పని చేస్తున్నాం"

"మంచిపని చేస్తున్నారు"

"ఆఁ మనం కాదనుకున్నాం అనుకో అతనికి అతనివాళ్ళకికూడా అలుసేకదా? ఈ ఈరోజు వున్న మోజు అతనికి భార్యమీద జీవితాంతం వుండదుకదా? సమయం వచ్చినప్పుడల్లా 'మీ అమ్మా నాన్న యిలాటి వాళ్ళు' అనో, 'ఏమీ లేకపోయినా ఇంత నీలుగుడు ఎందుకనో!' సూటీ పోటీ మాటలంటారు. మన బిడ్డను మనమే హీనపర్చుకున్నట్టు" అలా అనేసి నావైపు చూసింది రాజీ-నేను బాధపడ్డానేమోనని. ఈ సారి నేను బాధపడలేదు. రాజీ చెప్పేవన్నీ నగ్న సత్యాలు తనిప్పుడెదుర్కొం టున్న నిజాలు, కడుపుతీపి చంపుకోలేనప్పుడు ఎందుకొచ్చిన ఆవేశాలు? అదే అన్నాను రాజీతో-

"ఎవరదృష్టాలు వాళ్ళవి. ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు వదిలెయ్ రాజీ!" వాళ్ళెన్నుకున్న జీవితాలు బాగుంటే సంతోషపడ్దాం. లేకుంటే వాళ్ళ ఖర్మ అని సరిపెట్టుకుందాం" ఓదార్చాను.

నవ్వింది రాజీ "ఖర్మ అని సరిపెట్టుకోలేక ఈ వెధవ కడుపు తీపి ఎవరన్నారో గానీ, 'బిడ్డలు గర్భశత్రువులనీ' ఎంత అనుభవంతో అన్నారో!"

"నిజం రాజీ! నువ్వు చెప్పింది కరెక్ట్. తప్పులు చేసింది వాళ్ళు. నరకం అనుభవిస్తున్నది మనం. మామూలు శత్రువులయితే వదిలేస్తాం, మర్చిపోతాంకూడా. వీళ్ళింకా నయం. ఏదో వాళ్ళ జీవితాల్ని దెబ్బతీసుకున్నారు. కన్న తల్లిదండ్రులమీద కోర్టులో దావా వేసే బిడ్డల్నేవదులుకోలేక పోతున్నాం. వదిలెయ్" నిట్టూర్చి కదిలాను.

"దీప్తి ఏదీ?" నాలుగడుగులు వేసి అడిగాను.

"క్రిందుంది"

"చూసిపోతాను"

"సరే" అని కిందికి బయలుదేరింది.

ఇంటికెళ్ళగానే కనిపించిన అంబాసిడర్ కారు. నాన్న వచ్చారని తెలిసింది. సంతోషంగా లోపలకెళ్ళాను. కానీ నాన్నను చూస్తూనే నిబ్బరం కోల్పోయాను. వేగంగా నాన్న దగ్గరకు వెళ్ళి ఆయన గుండెల మీద వాలి ఏడ్చేశాను.

"ఏమిటమ్మా! ఏమైంది తల్లీ!" ఆయన బెదిరిపోయారు.

"నాకు శ్రావ్యను చూడాలనుంది నాన్నా!"

ఆయన గుండె ద్రవించి వుంటుంది. నేనాయన బిడ్డనుకదా.

"అలాగేనమ్మా! చూద్దువుగాని, లేచి ముఖం కడుక్కో అలా ఏడవకు తల్లీ! నేను చూడలేను"

"నాన్నా!" మళ్ళీ ఏడ్చాను.

ఈసారి ఏడ్పింది తల్లిగాకాదు, బిడ్డ దిగులుతోకాదు, సంతోషంగా, నా గుండెలో వేదన నిగ్రహించడానికి తనకు తండ్రి వున్నాడు. తనను లక్ష్యం చేసే తండ్రి తనకింకా వున్నాడు.

"లేమ్మా లే వెళదాంలే. ఎక్కడున్నారు వాళ్ళు"

"నాగ్‌పూర్‌లో వున్నారట నాన్నా!" లేచి కళ్ళు తుడుచుకుంటూ అన్నాను తన గుండెలో ఇంకా ఇన్ని కన్నీళ్ళున్నాయా? ఆశ్చర్యపోయాను.

"సారథి ఏడీ?"

"ఆఫీస్ కెళ్ళారు నాన్నా! వచ్చే టైం అయింది"

"ఏదో లేమ్మా! పసితనం తప్పు చేశారు. సారథికి చెప్పి వెళ్ళి తీసుకురండి"

నేను ఆశ్చర్యంగా నాన్నవైపు చూశాను. ఆ రోజు అందరికంటే ఎక్కువ ఆవేశపడింది నాన్న. తన ఏడుపుతో ఆయన కీరోజు పేగు కదిలింది కాబోలు.

"కోర్టు పనిమీద వచ్చి నిన్నుచూసి పోదామని వచ్చాను. వెళతానమ్మా!"

"అదేమిటి నాన్నా! ఈరోజుండి రేపెళ్ళుదురుగాని"

"లేదులేమ్మా! మరోసారి వస్తాను. పనుంది వెళ్ళాలి" లేచారాయన.

"చాలా సేపయిందా మీరొచ్చి?" మొదట వేయాల్సిన ప్రశ్న ఆఖర్న వేశాను.

"ఓ అరగంటయిందంతే. నువ్వీమధ్య రావడమేలేదు. నాన్నను చూడాలనిపించడం లేదమ్మా!"

నాన్న ఓ చిరునవ్వుతో ఆ మాటన్నా నాకు తెలుసు ఆయన పేగులోంచి, గుండెల్లోంచి పొర్లుకొచ్చిన వాత్సల్యం మధ్యగా దొర్లిన పిలుపదని. నేను కదలిపోయాను.

"వస్తాను నాన్నా! మీరీరోజు వుండిపోతే బాగుంటుంది"

ఆయన నవ్వారు.

"లేదమ్మా! స్నేహాంత్ ఒక్కడే వుంటాడింట్లో. అమ్మాయి పుట్టింటికెళ్ళింది, పిల్లలూ లేరు"

"తమ్ముడితో రోజూ వుంటావు కదనాన్నా! ఈరోజు ఇక్కడుండకూడదా?"

"అబ్బే! వుండకూడదని కాదమ్మా!"

అలా అని ఆయన అన్నా ఆయన మనసులో సంకోచం నాకు తెలుసు. ఇది కూతురిల్లు, అది కొడుకిల్లు. ఏమిటో ఈ మానసిక భావం! కన్న కూతురిమీద ప్రేమనూ చంపుకోలేక, ఆ బిడ్డతో కలిసి వుండనూ లేరు. నాన్న వెళ్ళిపోయారు. ఆయన వున్నంతవరకు బాగానే వుంది-మరలా మనసులో దిగులు చిక్కబడుతోంది. ఈయన ఏమంటారో!

★ ★ ★ ★

"ఏమండీ!" గోముగా పిలవబోయాను. నా కంఠంలో బెరుకు గ్రహించేమో ఆశ్చర్యంగా చూశారు నావైపాయన. ఆయన వంక చూశాను. భార్యా భర్తల మధ్య కూడా సంకోచాలుంటాయి. ఎంత స్వతంత్రంగా వుంటామో, ఒక్కోసారి అంత అస్వతంత్రులం మనసు శరీరం కూడా ఒకటే అనుకున్న దంపతుల మధ్య ఒక్కో క్షణంలో ఎంత దూరం!

నవ్వుకున్నాను. చప్పున నాకో సత్యం స్ఫురించింది. ఇరవై ఏళ్ళ క్రితం శ్రావ్య పదేళ్ళ పిల్లగా వున్నప్పుడు ఇద్దరి మధ్యా ఏవో కలతలు, విడిపోవాలన్నంత ఆవేశం. ఆనాడే విడిపోయి వుంటే ఈనాడు ఈయన కనుచూపు దూరానైనా తాను వుండగలిగేదా? ఈనాడు సూది మొనంత కూడా దూరం లేదు తమ మధ్య. ఆ క్షణంలో తను తొందరపడుంటే. "అమ్మో!"

"ఏమిటిరా, ఏమిటా భయం?"

తేరుకున్నాను. "ఏమండీ! శ్రావ్య వాళ్ళు నాగపూర్‌లో వున్నాళటండీ"

ఆయన ముఖంలో రంగులు మారాయి. వద్దనుకుంటున్న జ్ఞాపకాల్ని వెలికి తవ్విన బాధ అది, ఒక తీపి ప్రేమ, ఒక చేదు గుర్తు, రెండింటికీ పొంతన కుదరని జ్ఞాపకం అది.

"మనం వెళ్ళి పిల్చుకొచ్చుకుందామండీ"

నేను భయపడినట్లు ఏమీ జరగలేదు. ఐదు నిముషాల తర్వాత "నీ యిష్టం" అని మాత్రం అన్నారు. 'నీ యిష్టం' అన్న ఆ పదం వెనుక 'నాకూ యిష్టమే' అన్న భావప్రకటన గుప్తంగా వుంది.

"ఎప్పు డెళదాం?" ఆశగా, ఆనందంగా అడిగాను.

"అయిదారు రోజుల్లో వెళదాం"

నిరాశ పడ్డాను–తమాషా! అయిదేళ్ళు ఆగినదాన్ని అయిదురోజు లాగలేనని పిస్తోంది.

"రేపే వెళదామండీ" నోటిదాకా వచ్చింది ఆగాను. ఉహుఁవద్దు–వెళదామన్నారు అంతేచాలు.

★ ★ ★ ★

దీప్తి, శశికాంత్ ముఖ ద్వారానికి కట్టిన ఎలక్ట్రికల్ బల్బుల కాంతిలో వాళ్ళ పేర్లు మెరిసిపోతున్నాయి. ఆ కాంతిని వెల వెలపోయేలా చేస్తూ·రిసెప్షన్‌లో అతిథుల నాహ్వానిస్తూ కూర్చున్న దీప్తి, శశికాంత్ కళ్ళు వెయ్యి వాట్టుల బల్బుల్లా వెలిగిపోతున్నాయి.

"కంగ్రాచ్యులేషన్స్!"

"ఆంటీ మీరా! రండి. రారనుకున్నాను."

"రా రనుకుందా? అంటే బిడ్డను పోగొట్టుకున్న తను మరో బిడ్డను ఆశీర్వదించను రాననుకుందా!" ఆత్మన్యూనతాభావంతో చితికి పోయాను.

"మీరు ముందే వస్తారనుకున్నాం. ఎనిమిదయినా రాకపోతేనూ."

"ఆఁ....ఆఁ.... లేటయింది గెస్ట్‌లు వస్తేనూ" తేరుకుంటూ అన్నాను. ఎక్కడుందో రాజీ పరిగెట్టుకొచ్చింది.

"రా రా! కళ్ళు కాయలు కాచాయి నాకు. అన్నయ్య ఏరీ?"

"ఆయన రాలేదు" అటూ ఇటూ కాకుండా అన్నాను. ఎందుకనో నిన్నటినుండి ఆయన డల్‌గా వున్నారు. కూతురు దగ్గర కెళ్ళడానికి ఆయనకు అంతగా ఇష్టంలేదేమో?

"రా" సంతోషంగా నా చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది రాజీ.

బాధల్లో ఒకరికొకరం కావాలనుకునే స్నేహం మాది. మే మెళుతుంటే మిసెస్ మాధురీదేవి ఎదురుపడింది.

"కంగ్రాచ్యులేషన్స్."

థాంక్స్ చెప్పి కదిలింది రాజీ. నేను మరలా చిన్నబుచ్చుకున్నాను.

ఈ మాధురీదేవే ఆనాడు క్లబ్బులో నా కూతుర్ని నేనింట్లోకి రానీలేదని చెపినప్పుడు– "మంచిపని చేశావు. మనకా మాత్రం వ్యక్తిత్వంలేదా!" అని తనని రెచ్చగొట్టింది కానీ ఈ రోజు....? ఆమెది ఏ ఎండకా గొడుగు పట్టే తత్వమో లేక రాజీపడిన తల్లి దండ్రులతో పాటు రాజీపడిందో!

"పిన్నీ! ఐస్‌క్రీమ్ అతను యింకా రాలేదు. బాబాయ్ నిన్ను ఫోన్ వేయమన్నాడు."

"ఇప్పుడే వస్తాను" నా చెయ్యి వదిలేసి ఆ అమ్మాయి వెంట హడావుడిగా వెళ్ళింది రాజీ.

నేను ఒంటరిదానిలా మిగిలిపోయాను, నా చుట్టూ చాలా మంది జనం వున్నారు కానీ, నాలో ఒంటరితనం. ఈ ఒంటరితనం బావం పోవాలంటే శ్రావ్య ఇంటికి రావాలి. చాలా ఆలస్యంగా తెలిసిందీ సత్యం తనకు.

"రాజేశ్వరిగారు మంచి పని చేశారు. మన బిడ్డల్ని మనం కాక పోతే ఇంకెవరు చూస్తారు?"

"అవునవును. వాళ్ళు మనల్ని కాదనుకున్నా, మనం వాళ్ళని కాదనుకోలేంగా?"

"మన కులం కాదట?"

"ఏం కులాలో. మంచితనం కావాలిగానీ."

వాళ్ళెవరో తనకు తెలీదు. తనెవరో వాళ్ళకు తెలీదు కానీ వాళ్ళ లాటి వాళ్ళు తన కెంతమందో ఎదురయ్యారు-

"మన కులం- మన మతం కాని వాడిని ప్రేమించడ మేమిటి?" అన్నారు.

కాలం మారిందా? లేక అది వాళ్ళకు తనిచ్చిన చనువా? కాలం మారడానికి అయిదేళ్ళ కాలం పెద్దదేం కాదు. తను తన కూతుర్ని వెలివేసి అందరి నోళ్ళలో నానేలా చేసింది. ఆ దోషం తనది. రాజీని తల్లిగా పెంచిన దీప్తి అదృష్టవంతురాలు. తనే పిచ్చిది. బిడ్డ జీవితమూ నాశనం చేసింది. తను మనశ్శాంతీ పోగొట్టుకుంది. లోకం ఏమను కుంటుందో అని భయపడింది. లోకం ఏమీ అనుకోదు. మనం లోకానికి మాట్లాడను అవకాశం ఇవ్వకపోతే అది మాట్లాడదు. నిజం. అది మాట్లా డదు. భయపడుతుంది.

"అన్నపూర్ణమ్మగారూ! ఒక్కటి ఆలోచించండి" ఎవరో ఎవరి తోనో అంటున్నారు. అన్నపూర్ణమ్మ ఏమనిందో తన ఆలోచనల్లో తను వినలేదు.

"పెళ్ళి చేసేసుకున్నారు. ఇద్దరూ ఒకటైపోయారు. వాళ్ళని మనం విడదీసి మరలా పెళ్ళి చేసే సమాజం కాదు మనది."

"సమాజం సంగతి అలా వదిలేయండి. మన మనసే ఒప్పుకోదు కదా!"

"అలాంటప్పుడు నా ఇంటికి రావద్దని ఆ బిడ్డను వదిలేస్తే కన్న ప్రేమలో అర్థం ఏముంది? అది ప్రేమేనా? అసలు నువ్వు వదిలేసినంత మాత్రాన నువ్వనుకున్న తప్పు ఒప్పయిపోతుందా? అదీ కాకుండా మనం వదిలేస్తాం. వాడు అయోగ్యుడయిన ఆ బిడ్డను బాగా చూడడు, లేదా ఆర్థిక ఇబ్బందులవల్ల కష్టాలు వస్తాయి.

"వాడు మంచివాడు కాదు. డబ్బున్నవాడు కాడు, కాబట్టి ఈ పెళ్ళి మా కిష్టంలేదు అని కదా!" మనం వదిలేస్తున్నాం. వీలయితే మాట సహాయం, ఆర్థిక సహాయంచేసి ఆదుకోవాలి కానీ వదిలేయడంలో అర్థం ఏమిటండీ అసలు."

"నిజమే! నిజమే! రాజేశ్వరిగారు మంచిపని చేశారు. ఆ పిల్లవాడి దృష్టిలోనూ ఆమె మంచి అత్తగా మిగిలిపోయింది."

నేను తృళ్ళిపడ్డాను.

"అంటే....అంటే....దినేష్‌చంద్ర దృష్టిలో తను మానవత్వం లేని అత్తగా ముద్రింపబడిందా?"

మనసులో చీకటి మరలా చిక్కబడుతోంది. ఈ మనసు నిర్మలంగా వుండేదెప్పుడు? ఎంత పొరపాటు చేసింది తను. తన కూతుర్ని ఎన్నయినా ఆడగొచ్చు. రక్తసంబంధం కనుక శ్రావ్య మరిచిపోతుంది. ఆ రోజు తనింటికొచ్చిన రోజు అల్లుణ్ని ఏమనింది?

"నీ ఇంజనీరింగ్ డిగ్రీతో నా కూతుర్ని పోషిస్తే చాలనుకున్నావా? నా కూతురి కిక్కడ జరిగినట్టు జరపగలవా? ఎందుకు చేసుకున్నట్టు నా కూతుర్ని?" అని నిలదీసింది.

ఆ రోజు అతనేం మాట్లాడలేదు. పాపం మంచివాడు.

"ప్చ్! ఇప్పుడనుకుని ఏం లాభం?"

"ఏమిటే ఒక్కదానివే? ఆ టేబుల్ దగ్గర మధూలిక వాళ్ళున్నారు వెళ్ళకపోయావా?"

"ఫర్వాలేదు. నువ్వొస్తావని ఎదురు చూస్తున్నాను."

"ఐస్‌క్రీం వాళ్ళకు ముందే చెప్పిపెట్టాను టైమ్‌కి రావాలని. ఇప్పుడొస్తాడట వెధవ."

"పోనీలే ఇంకా డిన్నర్ బిగిన్ కాలేదు కదా!"

"నిజమే అనుకో. డిన్నర్లు పెట్టుకుంటాం గానీ ఎక్కడ లోపం జరుగుతుందోనని టెన్షన్."

నవ్వాను–

"వచ్చి తినే వాళ్ళకు కూడా ఎప్పుడెప్పుడు తిన్నా మనిపించి వెళ్ళిపోదామా అని టెన్షన్."

"నీకు కూడానా?" నవ్వింది రాజీ.

"నాకు నీ దగ్గరేమిటీ? కానీ రాజీ! మనసెందుకో త్వరగా వెళ్ళి పోయి మీ అన్నను తీసుకుని శ్రావ్య దగ్గర కెళ్ళాలనుంది!"

మనసులో కోరికను బయటపెట్టాను. మన జీవితంలో జరిగి పోయిన పుటల్ని ఇలాటి సంఘటనలు ప్రభావితం చేస్తాయి. ఈ అయి దేళ్ళు నిద్రపోయిందనుకున్న నా మనస్సు ఈ రోజున ద్రవించింది.

"అలాగే ఒక్క క్షణం. ఫోంచేసి వెళుదువు. శ్రావ్య రాగానే నాకు ఫోన్ చెయ్యి. నేనూ వస్తాను"

★ ★ ★ ★

"హలో!"

"హలో!"

"హలో సింధూ! నువ్వా! నాగపూర్ నుంచి వచ్చేశావా? శ్రావ్య వాళ్ళు ఇంట్లోనే ఉన్నారా? నే నొచ్చేస్తున్నాను."

"నువ్వు రానక్కరలేదు. శ్రావ్య రాలేదు."

"ఏమిటీ? శ్రావ్య రాలేదా? రానందా?"

"ఆఁ!"

"శ్రావ్య రానందా? దినేష్ పంపలేదా?"

"రెండూ ఒకటే కదా!"

"ఏమైంది?"

"ఏమైంది సింధూ?"

"నేనొస్తున్నాను భయపడకు"

రాజీ వచ్చి నా ఎదురుగా ఇంకా సరిగ్గా కూర్చోనేలేదు....

"నేను చాలా పొరపాటు చేసాను రాజీ! అతని మనసులో నేనన్న మాటలు అలాగే ముద్రపడిపోయాయి"

"ఏమన్నాడు? అసభ్యంగా మాట్లాడాడా?"

"ఆ అవకాశం మీరు పోగొట్టుకున్నారు అన్నాడు"

"ఏ అవకాశమట!"

"తను అడిగినప్పుడు మనం రానీలేదట! ఇప్పుడు మన స్థాయిలోనే తన భార్యని పోషిస్తున్నాడట"

"ఏం మనం ఆమాత్రం ఆవేశపడకూడదటనా? వీళ్ళు చేసింది తప్పుకాదా చెప్పకుండా చేసుకోవడం?"

"వద్దు రాజీ! వాళ్ళ తప్పుల్ని మనం మర్చిపోవాలి తప్పదు. మన తప్పుల్ని మాత్రం వాళ్ళు మర్చిపోరు"

"శ్రావ్య ఏమంది?"

"నిన్ను నేనెంత ప్రాధేయపడ్డాను మమ్మీ! అప్పుడు మమ్మల్ని రానిచ్చుంటే నాకీ బాధలేదు కదా! ఆయన మనస్సు నొప్పించి నేరాను" అంది.

"అంటే....శ్రావ్యను వెళ్ళమన్నాడా?"

"ఆఁ...."

రాజీ క్షణం మాట్లాలేదు.

"ఆయనగారు మన మనసు బాధ పెట్టలేదటనా? కని పెంచిన తల్లి మనసు ఐదేళ్ళుగా ఎంత బాధపడిందో ఆ పిల్లకసలు తెలుసా? ఉండు నేనెళ్ళి నాలుగు అడిగేసి వస్తాను. ఎందుకు రాదో చూస్తాను"

తల అడ్డంగా వూపాను.

"నాలో జవసత్వాలు లేవిప్పుడు. కోప్పడ్డానికి కాని, ఆవేశపడ్డానికి గ్గాని. పిల్లలంతా అంతే మనం మనశ్శాంతి కావాలంటే వాళ్ళని మర్చిపోనన్నా మర్చిపోవాలి, లేదా వాళ్ళతో రాజీ పడనన్నా రాజీపడాలి" వెక్కి వెక్కి యేడ్చాను.

శ్రావ్య అన్న మాటలకు గుండెలో పేరుకున్న అవమానం నీళ్ళ రూపంలో బయటకొచ్చింది.

"ఛ! ఏడవకు. మొదటిసారి కదా! రెండోసారి వాళ్ళే వస్తార్లే"

"రెండోసారా? శ్రావ్య తన భర్త మనసు నొప్పించదు. నేను మాత్రం నా భర్త అవమానపడితే భరించగలనా? వద్దులే రాజీ శ్రావ్యని మరచిపోతాను"

రాజీ నావేపు జాలిగా చూస్తూ....

"పిచ్చిదానివి. కడుపున పుట్టిన బిడ్డమీద మన ప్రేమే మనకు శత్రువు. వాళ్ళని మర్చిపోలేం. వెన్నలాటి తల్లులంకదా మనం"

బేలగా చూసాను.

"నిజమే! ఇప్పుడు అవమానించబడేకంటే ఆనాడు కాస్త తెలివిగా ముందు చూపుతో ఆలోచించి 'నీ జీవితం నీది' అని వాళ్ళని లోపలికి అడుగు పెట్టనిచ్చి వుంటే ఈనాడు మామధ్య అంతదూరం వుండేది కాదు.

నేను గౌరవాన్ని పొందడాన్ని బదులుగా అగౌరవించబడ్డాను. వాళ్ళకి భయపడే స్థితిలో నేను ఉన్నాను. ఎంత దురదృష్టం?"

"బాధపడకు....బాధపడకు సింధూ"

"బాధపడి ఏం ప్రయోజనం రాజీ! చేతులు కాలాక ఆకులు పట్టుకుని...." ఏడ్చేశాను.

"కన్న ప్రేమా! నీదెంత దుర్మార్గం" ఏడుపుని దిగమింగుకుంటూ అనుకున్నాను.

❋